దేవరుప్పుల : పేద కుటుంబాలకు క్రిస్మస్ కిట్లు అందిస్తున్న బాలయేసు విద్యార్థులు

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 22 : జనగామ పట్టణంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌తోపాటు సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో శుక్రవారం మినీ క్రిస్మస్ వేడుకలు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఎన్ మరియ జోసెఫ్, జైమోన్ థామస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో యేసు క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపేలా ఆకర్షణీయమైన తొట్టె (క్రిబ్) ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాంతి, ప్రేమ, కరుణతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో సెయింట్ మేరీస్ హైస్కూల్ డైరెక్టర్ తుమ్మ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, కంచనపల్లి ప్యారిస్ క్రిస్ట్ ఫాదర్ థామస్ గోపు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు..

లింగాలఘనపురం : మండలంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రిస్మస్ తాత వేషధారణలో పలువురికి దుస్తులు, స్వీట్లు పంచిపెట్టారు. నెల్లుట్ల చర్చిలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా రెవరెండ్ ఎల్మర్ విక్టర్, నల్ల సుకుమార్, నల్ల ఆమోస్, పీ సుధాకర్, టీ కోర్నెల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు క్రిస్మస్ కిట్లు పంపిణీ

దేవరుప్పుల : మండల కేంద్రంలోని బాలయేసు ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాల యాజమాన్యం శుక్రవారం వివిధ గ్రామాల్లోని 300 పేద కుటుంబాలకు క్రిస్మస్ కిట్లు అందించారు. పాఠశాల కరెస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ సూపాయప్పన్ మాట్లాడుతూ ఒక్కో కిట్టు విలువ రూ.వెయ్యి ఉంటుందని ఆయన తెలిపారు.

దేశం శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లాలి

జనగామరూరల్ : యువత, విద్యార్థి లోకం సన్మార్గంలో పయనిస్తే దేశం శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లుతుందని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల ఫాదర్ విజయపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో క్రిస్మస్ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రేమకు ప్రతిరూపం దైవమని, దేవున్ని స్మరించడం ద్వారా శాంతి పెంపొందుతుందన్నారు. గౌరవ అతిథి ఇన్నారెడ్డి, కళాశాల డైరెక్టర్ అగస్టీన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ అనిత, డాక్టర్ యాకోబ్ ఉన్నారు.

కృషి, పట్టుదలతో చదువులో రాణించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రాము
- ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి


జనగామ రూరల్ : గానుగుపహాడ్ పాఠశాలలో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఈవో రాము

జనగామరూరల్, డిసెంబర్ 22 : విద్యార్థులు కృషి, పట్టుదలతో చదువులో రాణించాలని డీఈవో రాము సూచించారు. మండలంలోని గానుగుపహాడ్‌లో గణితశాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంగాల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డీఈవో రాము మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కృషి, పట్టుదలతో చదివి టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. స్వీయ మూల్యాంకనం ద్వారా స్థాయిని అంచనా వేసుకుని చక్కటి యాక్షన్‌ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్విజ్, రంగోలి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, సోమయ్య, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

జనగామ చౌరస్తా : భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు సెయింట్ మేరీస్ హైస్కూల్, ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల నోడల్ అధికారి వీ రాజేందర్, విశిష్ట అతిథులుగా ప్రిన్సిపాల్స్ జీ శ్రీ నివాసరావు, జైమోన్ థామస్, ఇందిరా హాజరై రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే గణితంపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. గణితం ప్రాముఖ్యతను తెలిపేలా పాఠశాల విద్యార్థులకు క్విజ్, ట్యాలెంట్ టెస్ట్‌లతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల గణిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడంతో పాటు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సెయింట్ మేరీస్ హైస్కూల్ డైరెక్టర్ తుమ్మ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, ఏకశిల పబ్లిక్ స్కూల్ సెక్రెటరీ సి ఉపేందర్‌రెడ్డి, జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు భూపతి, ఆరిఫ్ రియాజుద్దీన్, సుభాశ్, శాలీం, ప్రమీల, మైఖేల్, ప్రవీణ, జైపాల్‌రెడ్డి, రమణారెడ్డి, నర్మద, రాజిరెడ్డి, క్రాంతి, సంపత్, జ్యోతి, హరిత, కమల, వాణిశ్రీ, చరిత, తస్లీమ్, పీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో..

దేవరుప్పుల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాపోలు ప్రభాకర్ నేతృత్వంలో అధ్యాపక బృందం రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటికలు, బుర్రకథలు, నృత్యాలు ప్రదర్శించారు. పాఠశాల ప్రత్యేక అధికారి బీ నవీన మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు నిర్మల పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ ఎండీ ఫర్వేజ్ విద్యార్థులకు గణితంలో క్విజ్, ఫజిల్స్, టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. గణిత ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎల్లాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనగామ చౌరస్తా : ధర్మకంచ జడ్పీహైస్కూల్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

పోచన్నపేట జీపీలో రికార్డుల పరిశీలన

పోచన్నపేట గ్రామ పంచాయతీలో విచారణ జరుపుతున్న డీపీవో రంగాచారి

బచ్చన్నపేట, డిసెంబర్ 22 : మండలంలోని పోచన్నపేటలో గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండానే గ్రామ కార్యదర్శి నిధులు డ్రా చేస్తున్నారని ఆరోపిస్తూ వార్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి విచారణ చేపట్టారు. సర్పంచ్ గట్టు మంజుల, ఉపసర్పంచ్ జూల కృష్ణ, పలువురు వార్డు సభ్యులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా, ఎంపీడీవో రఘురామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీవో గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎజెండా వివరాలు, సభ్యుల హాజరు, తీర్మానం పుస్తకాలు, ఎంబీ రికార్డులు పరిశీలించారు. సమావేశాలకు వార్డు సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు అవుతున్నారా అని ప్రశ్నించారు.

వార్డు సభ్యులు హాజరై తీర్మానాలు చేస్తే రిజిస్టర్‌లో సంతకాలు తీసుకోవాలని సూచించారు. దీనికి పంచాయతీ కార్యదర్శి అంగీకరించారు. ప్రతి పైసా రికార్డు అయ్యాకే డ్రా చేస్తున్నామని, దుర్వినియోగానికి పాల్పడలేదని సర్పంచ్ మంజుల వెల్లడించారు.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే 'పల్లా'తో నాయకులు

బచ్చన్నపేట, డిసెంబర్ 22 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మండలంలోని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, నాయకులు బొమ్మెన ఆంజనేయులు, వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే పల్లాను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఘట్‌కేసర్‌లోని నీలిమా దవాఖానకు నియోజకవర్గం నుంచి ఎంతో మంది వెళ్లి ఉచితంగా వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు.

కళ్లెం గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

లింగాలఘనపురం, డిసెంబర్ 22 : మండలంలోని కళ్లెం గ్రామ పంచాయతీ కార్యదర్శి బూరెడ్డి వంశీని విధుల నుంచి తప్పిస్తూ డీపీవో రంగాచారి ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీవో మల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు ఎంబీ పుస్తకాలను గ్రామ కార్యదర్శి వినియోగించడం, సర్పంచ్ తిప్పారపు ఈరమ్మ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో కార్యదర్శి వంశీని డీపీవో సస్పెండ్ చేశారన్నారు. సర్పంచ్‌కు కూడా షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ మేరకు ఉత్తర్వు కాపీని సర్పంచ్‌కు శుక్రవారం అందించినట్లు ఎంపీవో మల్లికార్జున్ తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జాతీయ వినియోగదారుల దినోత్సవంలో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

వినియోగదారుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శివలింగయ్య

జనగామ చౌరస్తా, డిసెంబర్ 22 : వినియోగదారులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పౌరసరఫరాల జిల్లా అధికారి ఎం రోజారాణి అధ్యక్షతన జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, విశిష్ట అతిథిగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ (రెవెన్యూ) హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ ఆన్‌లైన్ కొనుగోళ్ల విషయం లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినియోగదారులు తమ బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్, ఓటీపీ వివరాలను ఎవరికి చెప్పొద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రకటనలకు ఆకర్షితులై సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దని తెలిపారు. డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణ (ఎలక్ట్రానిక్ కామర్స్) అనే ఎలక్ట్రానిక్ నెట్ వర్క్, ప్రధానంగా ఇంటర్‌నెట్ ద్వారా వస్తువుల కొనుగోలు, సేవలు, అమ్మకాలు, నిధుల డేటా ప్రసారం చేస్తారని పేర్కొన్నారు. వినియోగదారులు ఏదైనా వస్తువు కొనుగోలు చేసి మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వినియోగదారుల సహాయ కేంద్రం వారు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 180042500333/1367కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని శివలింగయ్య సూచించారు. జనగామ పట్టణంలో తాగు నీటిని సరఫరా చేసే ప్రైవేట్ వాటర్ ప్లాంట్స్‌ను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థుల కోసం అవసరమైతే ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధిక్ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ, జడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీఏవో వినోద్‌కుమార్, సీపీవో సయ్యద్ ఇస్మాయిల్, డీఎం సివిల్ సప్లై ప్రసాద్, లీగల్ మెట్రాలజీ డ్రగ్ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ, ఏడీ హ్యాం డ్లూమ్స్ చౌడేశ్వరి, వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, డీఎం మార్కెటింగ్ నరేందర్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ కేఆర్ లత, డీటీలు దేవా, శ్రీనివాస్, మెప్మా పాల్గొన్నారు.

పాఠశాలలో సైన్స్‌ల్యాబ్‌కు భూమిపూజ

భూమి పూజ చేస్తున్న అరవింద్‌రెడ్డి

బచ్చన్నపేట, డిసెంబర్ 22 : మండలంలోని కేశిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌కు శుక్రవారం జనగామ మున్సిపల్ కౌన్సిలర్ మల్లవరం అరవింద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ల్యాబ్ నిర్మాణానికి రూ.16లక్షలు మంజూరయ్యాయని ఆయన వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ భిక్షపతి, సర్పంచ్ మల్లవరం దివ్య, హెచ్ఎం స్వామి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కాపర్తి హరిప్రసాద్, మధు, రాజమౌళి పాల్గొన్నారు.

బుర్రా వెంకటేశంకు అభినందనలు

బచ్చన్నపేట, డిసెంబర్ 22 : తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఇటీవల నియమితులైన బుర్రా వెంకటేశంకు వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం బుర్రా వెంకటేశంను కలిసి ఘనంగా సత్కరించారు. నరేశ్‌కుమార్ మాట్లాడుతూ జనగామ నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయిలో వెంకటేశంకు ఉన్నత పదవి లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యా వ్యవస్థ మెరుగుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు.

మండల వైద్యాధికారిగా రవితేజ

దేవరుప్పుల, డిసెంబర్ 22 : దేవరుప్పుల మండల వైద్యాధికారిగా రాజపూడి రవితేజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వైద్యురాలు పూజ హైదరాబాద్‌కు బదిలీకాగా, ఆమె స్థానంలో రఘునాథపల్లి నుంచి రవితేజ ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రవితేజ శుక్రవారం మాట్లాడారు. కొవిడ్ తిరిగి వ్యాపించే అవకాశాలున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా ఆయా గ్రామపంచాయతీల్లో పరిశుభ్రత, రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. గుంపులుగుంపులుగా తిరిగే ప్రదేశాల్లో తప్పనిసరిగా మాస్కులు ధరించాలని కోరారు. కరోనా వ్యాపిస్తే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇందుకు తగిన వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 22 : జనగామ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2కు సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించిందని అర్బన్ సీఐ ఎల బోయిన శ్రీనివాస్ తెలిపారు. మృతుడి వయసు 25నుంచి 30ఏళ్లు ఉంటాయని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

'నా సామి రంగా'లో చిందు కళాకారులు

సినిమా షూటింగ్‌లో పాల్గొన్న కళా బృందం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 22 : హీరోలు నాగార్జున, అల్లరి నరేశ్, రాజ్‌తరుణ్ కలిసి నటిస్తున్న మల్టీ స్టారర్ సినిమా 'నా సామి రంగా'లో లింగాలఘనపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారులు అవకాశం లభించింది. దీనికి సంబంధించిన వివరాలను చిందు కళాకారుడు గడ్డం పరశురాములు బృందం శుక్రవారం విలేకరులకు తెలిపారు. పెద్ద సినిమాలో నటించే అవకాశం తమకు రావడం సంతోషంగా ఉందని అన్నారు.

నేడు క్రిస్మస్ గిఫ్ట్‌ప్యాక్‌ల పంపిణీ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 22 : క్రిస్మస్ సందర్భంగా శనివారం క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్ట్‌లను అందించడంతోపాటు విందు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని కేఆర్ గార్డెన్‌లో ఉదయం 11గంటలకు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరవుతారని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

రఘునాథపల్లి, డిసెంబర్ 22 : ఖిలాషాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మారపాక కొంరయ్య తల్లి మారపాక లక్ష్మి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మారుజోడు రాంబాబుతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొంరయ్యను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ చెంచు రమేశ్ ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

అదనపు కలెక్టర్ లలిత్‌కుమార్

సిరిపురంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లలిత్‌కుమార్

లింగాలఘనపురం, డిసెంబర్ 22 : సిబ్బంది పనితీరును పర్యవేక్షించడంతోపాటు ప్రతి రికార్డుపై ఎంపీడీవోలు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ పర్మర్ లలిత్‌కుమార్ సూచించారు. మండలంలోని సిరిపురం, లింగాలఘనపురంలో ఆయన శుక్రవారం పర్యటించి స్వచ్ఛసర్వేక్షణ్ పనులను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్థానికంగా ఉంటేనే సమగ్ర సమాచారం తెలుస్తుందన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట డీఆర్డీవో మొగిలప్ప, సీఈవో అనిల్, ఎస్బీఎం డీసీ కరుణాకర్, ఎంపీడీవో సురేందర్‌నాయక్, ఎంపీవో మల్లికార్జున్, సర్పంచ్ మర్రి లక్ష్మీభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శంకర్ ఉన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి : డీపీవో

బచ్చన్నపేట, డిసెంబర్ 22 : జిల్లాలోని ప్రతి పల్లెను పరిశుభ్రంగా ఉంచాలని, అప్పుడే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ఆస్కారం ఉండదని జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సానిటేషన్ పనులు నిర్వహించేలా పర్యవేక్షించాలన్నారు. పంచాయతీ రికార్డులు పక్కాగా నిర్వర్తించాలన్నారు. ఎంపీడీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు కవిత, సౌజన్య, రేవతిగౌడ్, ప్రశాంత్‌ఆచార్యా, రాజశేఖర్, రాధాక్రిష్ణ, కిరణ్‌కుమార్, భరత్, వెంకటేశ్, దేవిప్రసాద్, శ్రీనివాస్, భానుచందర్, సతీశ్ రెడ్డి, మధు, ప్రశాంత్ పాల్గొన్నారు.

గుట్టను స్థానిక అవసరాలకే వాడాలి

పెద్దగుట్ట ఫెన్సింగ్ పనులను అడ్డుకున్న రైతులు

దేవరుప్పుల పెద్దగుట్ట వద్ద ప్రొక్లెయిన్‌ను అడ్డకుంటున్న రైతులు

దేవరుప్పుల, డిసెంబర్ 22: దేవరుప్పుల పెద్దగుట్ట, దాని పరిసరాలను స్థానిక అవసరాలకు వాడడంతోపాటు పశుపక్షాదుల జీవనానికి అంతరాయం లేకుండా చూడాలని రైతులు కోరారు. ప్రభుత్వ స్థలమైన పెద్దగుట్ట ప్రాంతాన్ని అప్పటి ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్ పేర ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అనుమతినిచ్చింది. దీంతో ఇక్కడి ప్రభుత్వ భూమిని రెవెన్యూశాఖ తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన సంస్థకు బదలాయించింది. దేవరుప్పుల పరిధిలోని పెద్దగుట్ట సర్వే నంబర్ 286లో 125ఎకరాలు, మన్‌పహాడ్ పరిధిలోని సర్వే నంబర్ 57లో 2.20 ఎకరాలు, సర్వే నంబర్ 68లో 17.20 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూశాఖ నుంచి పరిశ్రమల శాఖకు కేటాయించారు. కాగా నేటికీ పరిశ్రమ మంజూరు కాకపోగా శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ తమకు కేటాయించిన భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ఉపక్రమించింది. ఫెన్సింగ్ కోసం ప్రొక్లెయిన్‌తో గుంటలు తవ్వే పనులు చేపట్టగా స్థానిక రైతులు అడ్డుకున్నారు. పశువులు, జీవాలు ఈగుట్టపై మేస్తాయని, పశుపక్షాదులకు ఇది తోడ్పడుతుందన్నారు. దాదాసాహెబ్ కాలనీ వాసులకు కట్టెలు, వనరులు ఈ గుట్టపైనే లభ్యమవుతాయన్నారు. పరిశ్రమలు నెలకొల్పితే కాలుష్యం పెరుగుతుందని, వందలాది ఎకరాలు పచ్చటి పొలాలు దెబ్బతింటాయన్నారు. అందుకే ఫెన్సింగ్ పనులు ఆపాలని అధికారులను కోరారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి మాట్లాడుతూ తాము మొదటి నుంచీ వనరులు కొల్లగొట్టే చర్యలకు వ్యతిరేకమన్నారు. ఇసుక అక్రమ రవాణా, వానకొండయ్య గుట్టపై క్వారీ పనులు, పరిశ్రమల ఏర్పాటును అడ్డుకున్నామన్నారు. పెద్ద గుట్ట ప్రాంతాన్ని రెవెన్యూశాఖ వద్దే ఉంచాలని, ప్రభుత్వ భూమిగా చూపాలని అధికారులను కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే అనుమాండ్ల యశస్వినీరెడ్డితో మాట్లాడి ఈ గుట్టను స్థానిక వనరుల కిందనే ఉంచేలా చూస్తామని తెలిపారు.

జాబ్ మేళాలో 80 మందికి ఉద్యోగాలు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 22 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్ మేళాకు సుమారు వంద మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్ ఉమారాణి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మ్యాజిట్ బస్ ఇండియా ఫౌండేషన్ సంస్థలో వివిధ కేటగిరిల్లో 335 ఉద్యోగాలు ఇవ్వడానికి ఇంటర్వ్యూలు నిర్వహించగా, 80 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

రైస్‌మిల్లు నిర్మాణాన్ని తొలగించాలి

దేవరుప్పుల, డిసెంబర్ 22: మండలంలోని గొల్లపల్లి శివారు సర్వే నంబర్ 10లో దేవాదుల కాల్వ నిర్మాణానికి ఉద్దేశించిన స్థలంలో సదరు పట్టేదార్లు అక్రమంగా రైల్ మిల్లు నిర్మాణం చేపట్టారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాం అన్నారు. దీనిపై శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో పలుమార్లు దేవాదుల ఇంజినీర్లకు విజ్ఞప్తి చేశామని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 22 : జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికిగాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్ కోర్నేలియస్ తెలిపారు. శుక్రవారం ఆయనొక ప్రకటన చేశారు. www. telanganaepass. cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

మృతురాలి కుటుంబానికి రాజయ్య పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్, డిసెంబర్ 22 : మండలంలోని కూనూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు దాట్ల బాబు తల్లి ఎల్లమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గ్రామానికి చేరుకుని ఎల్లమ్మ మృతదే